కొత్త పింఛన్లకు మోక్ష మెప్పుడో?

- ఏడాదవుతున్నా ఒక్క పింఛన్ కూడా మంజూరు చేయని ప్రభుత్వం
- కనీసం దరఖాస్తులు స్వీకరించని వైనం
- సచివాలయాల చుట్టూ అర్హుల ప్రదక్షిణలు
- వెబ్‌సైట్ తెరుచుకుంటే చెబుతామంటున్న అధికారులు
- నియోజకవర్గంలో 3వేల మందికి పైగా ఎదురుచూపులు

పెద్దకడబూరు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినా నేటికీ ఒక్కటంటే ఒక్క కొత్త పింఛన్‌ను కూడా మంజూరు చేయలేదు. కొత్తవి మంజూరు చేయకపోగా ఉన్న వాటిలో కోత విధించే పనిలో ఉంది. అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు పింఛన్‌ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అధికారులు మాత్రం వెబ్‌సైట్ తెరుచుకోవడం లేదని, ఓపెన్ అవగానే వివరాలు వెల్లడిస్తామని తిప్పి పంపుతున్నారు. దీంతో అర్హులైన వారు ఎప్పుడు వెబ్‌సైట్ తెరుచుకుంటుందా.. ఎప్పుడు దరఖాస్తు చేసుకుందామా అని నెలల తరబడి ఎదురుచూస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే నెలల వ్యవధిలోనే పింఛన్



మంజూరు చేసేవారు. వితంతు పింఛన్ అయితే మరింత వేగంగా మంజూరు అయ్యేది. గత ప్రభుత్వ హయాంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయాలు, పార్టీలు, కుల మతాలకు అతీతంగా పింఛన్‌లు మంజూరు అయ్యేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకు కొత్త పింఛన్‌ల ఊసే లేదు. భర్త చనిపోయి సంవత్సరం అవుతున్నా(2024 ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి) వితంతు పింఛన్‌లు మంజూరు కాక మంత్రాలయం నియోజకవర్గంలో వందల సంఖ్యలో మహిళలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, దివ్యాంగులు అల్లాడిపోతున్నారు. కనీసం పింఛన్ అయితా అందితే మందుల ఖర్చుల కోసం అయినా ఎవరిపైనా ఆధారపడాల్సిన అవసరం రాదు అని కన్నీళ్లు పెడుతున్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. బీసీలకు 50ఏళ్లకే పింఛన్ ఇస్తామని ఆశ చూపిన చంద్రబాబు ఆ హామీ గురించి అసలు ఆలోచనే చేయడం లేదు.

సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు..

మంత్రాలయం నియోజకవర్గంలో 4 మండలాలలో దాదాపుగా 3వేలకు పైగా అర్హులైన వారు కొత్త పింఛన్‌ల కోసం ఎదురుచూస్తున్నారు. ఇక 50ఏళ్లకే పింఛన్‌లు ఇస్తే ఇక అంతే.. ఎంతమందో చెప్పలేము. పింఛన్‌ల కోసం దరఖాస్తు చేసుకోవడం కోసం వీరంతా సచివాలయాలు చుట్టూ, ఎంపీడీఓ కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. మరి కొందరు టీడీపీ నాయకుల ఇంటిచుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. అయితే వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదని అధికారులు సమాధానమిస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంవత్సరం పొడువునా వెబ్‌సైట్ అందుబాటులో ఉండేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సంవత్సరం దాటినా కొత్త పింఛన్‌ల ద్యాసే లేదు. అధికారులు మాత్రం ప్రభుత్వం నుంచి ఏ ఆదేశాలు లేకుండా దరఖాస్తులు స్వీకరించలేమని లబ్ధిదారులకు తెగేసి చెప్పి పంపుతున్నారు.

ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నా



కుటుంబ పెద్దదిక్కును కోల్పోయి ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నా. నాకు కూతురు ఉంది. ఆమె 9వ తరగతి చదువుతోంది. ఒక సెంటు భూమి కూడా లేదు. కూలీకి పోయి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా. పింఛన్ వస్తే తమకెంతో ఆసరాగా ఉంటుందని నెలనెలా కార్యాలయాలు, సచివాలయాల చుట్టూ తిరుగుతున్నా. మా సమస్య ఎన్నడు తీరుతుందో.. – ముల్లా హసీనా బీ, మేకడోణ, పెద్దకడబూరు మండలం

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలి



కొత్త పింఛన్‌ల మంజూరుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. పాత పింఛన్‌ల పరిశీలన పూర్తి అయిన తరువాత కొత్త వాటికి అవకాశం ఉంటుంది. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందితే అర్హుల దరఖాస్తులను స్వీరించి సంబంధిత వెబ్‌సైట్ ఓపెన్ అయితే తరువాత అందులో పొందపరచి కొత్తవి మంజూరు చేస్తాం.

– ప్రభావతి ఎంపీడీఓ పెద్దకడబూరు

పథకాల పేరుతో మభ్య పెడుతున్న సర్కార్

ఎమ్మిగనూరుటౌన్: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇవిగో పథకాలు అదిగో ఇస్తాం అంటూ ప్రజలను మభ్యపెడుతూ కాలం వెళ్లదీస్తోందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్న గౌడ్, పట్టణ కార్యదర్శి రంగన్న అన్నారు. ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహించే 11వ నియోజకవర్గ సీపీఐ మహాసభల కరపత్రాలను ఆదివారం స్థానిక కార్యాలయం ఆవరణలో ఆవిష్కరించి వారు మాట్లాడారు. విదేశాల్లో వున్న నల్లధనాన్ని భారత్‌కు రప్పిస్తామని ప్రధాని నరేంద్రమోదీ చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క పైసా కూడా తేలేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామని ఏడాదైనా పూర్తిగా అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్ట్‌లను పూర్తిచేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహించడం దారుణమన్నారు. నియోజకవర్గ మహాసభలకు పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు జబ్బార్, బజారి, మద్దిలేటి నాయుడు, సోమేశ్వర్‌రెడ్డి, గిడ్డయ్య, మహిళా సమాఖ్య నాయకులు వాణి, ఈరమ్మ పాల్గొన్నారు.

టీడీపీని వీడి బీజేపీలో చేరిక

ఎమ్మిగనూరుటౌన్: ఇటీవల టీడీపీ సభ్యత్వానికి రాజీనామా చేసిన పట్టణంలోని 21వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ దయాసాగర్ ఆదివారం విజయవాడలో బీజేపీ కండువా కప్పుకున్నారు. ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్‌రెడ్డి తగిన ప్రాధాన్యత ఇవ్వకపోతుండటంతోనే ఆయన టీడీపీని వీడినట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో పెట్టుబడిదారుడిగా వ్యవహరించిన ఓ వ్యాపారవేత్తకే ఎమ్మెల్యే పట్టం కట్టారని, ఆయన పెత్తనం పార్టీలో పెరిగిపోవడంతో పార్టీని వీడాల్సి వచ్చిందని దయాసాగర్ అనుచరులు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

మోకాళ్లపై కూర్చొని నిరసన



నిరసన తెలుపుతున్న ఇంజినీరింగ్ కార్మికులు

ఎమ్మిగనూరుటౌన్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని 47రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో ఇంజనీరింగ్ కార్మికులు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. యునియన్ నాయకులు నారాయణ, రాజేంద్ర మాట్లాడుతూ ఇంజినీరింగ్ విభాగంలో టెక్నికల్ కార్మికులకు రూ.29,200, నాన్‌టెక్నికల్ కార్మికులకు రూ.24,500 నెలసరి వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, జాతీయ సెలవులతో పాటు ఆదివారం సెలవులను కార్మికులను వర్తింపజేయాలని కోరారు.

సింగిల్ విండో మాజీ అధ్యక్షుడికి పరామర్శ



ఆస్పత్రిలో తిరుమల్ రెడ్డిని పరామర్శిస్తున్న బుట్టా శివనీలకంఠ

ఎమ్మిగనూరుటౌన్: అనారోగ్యంతో కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గోనెగండ్ల సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు తిరుమల్‌రెడ్డిని ఆదివారం ఆస్పత్రికి వెళ్లి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బుట్టా శివనీలకంఠ పరామర్శించారు.

కార్మికుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా?



ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కార్మికులు

ఆదోని టౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు కూటమి ప్రభుత్వానికి పట్టవా అని కార్మికులు ప్రశ్నించారు. ఆదోని మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ చేపట్టిన సమ్మె ఆదివారానికి 19వ రోజుకు చేరింది. కార్మికులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 45 రోజుల నుంచి ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం ఇంతవరకు చర్చలకు పిలుపునివ్వకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు పీరాసాహెబ్, సోమన్న, అహ్మద్, కర్రెప్ప, కృష్ణమూర్తి, కె.పి.చంద్ర, శరత్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఏర్పాటుకు భూమిపూజ



నెరుడుప్పలలో భూమిపూజ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గోనెగండ్ల: మండలంలోని నెరుడుప్పల గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించేందుకు కట్ట ఏర్పాటుకు ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులు భూమి పూజ చేశారు. ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు ఆంధ్రయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మహాదేవ్, జిల్లా నాయకుడు లక్ష్మన్న మాట్లాడుతూ జూలై 7న ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని అన్ని గ్రామాల్లో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో జరుపుతున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అమలైన నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మాదిగల ఆత్మగౌరవ దినోత్సవంగా పండుగ వాతావరణంలో జరిపి మాదిగల ఐక్యతను, బలాన్ని ప్రదర్శించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రామాంజినేయులు, విజయ్, యాకోబ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



హొళగుంద: దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ పూజారులు మూల విరాట్‌లకు సుప్రభాతసేవ, అభిషేకాలు, కుంకుమార్చన, బండారార్చన, మహామంగళారతి తదితర పూజలు శాస్త్రోక్తకంగా చేపట్టారు. స్వామివారిని దర్శించుకోవడానికి ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వచ్చారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు పార్టీలో పదవులు పొందిన నాయకులు కృషి చేయాలని పార్టీ సీనియర్ నాయకుడు, బుట్టా ఫౌండేషన్ అధినేత బుట్టా శివనీలకంఠ సూచించారు. వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియామకమైన పి.రాజరత్నం ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయనతో పాటు పట్టణ పార్టీ అధ్యక్షుడు కామర్తి నాగేషప్పను సత్కరించారు. తనకు వైఎస్సార్‌సీపీలో రాష్ట్ర స్థాయి పదవి ఇచ్చినందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ బుట్టారేణుకకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పార్టీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి విరూపాక్షిరెడ్డి, నందవరం మండల పార్టీ అధ్యక్షుడు శివారెడ్డిగౌడ్, పట్టణ ఉపాధ్యక్షుడు కోటకొండ నరసింహులు, నాయకులు హరిరెడ్డి, కడివెళ్ల ఉరుకుందుగౌడ్, చిన్న, గౌస్ తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ నాయకుడు బుట్టా శివనీలకంఠను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి రాజరత్నం

యువత పోరుకు తరలిరావాలి

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం నిర్వహించే యువత పోరు కార్యక్రమానికి యువత అధిక సంఖ్యలో తరలి వచ్చి కూటమి ప్రభుత్వ వెన్నుపోటును ఎండగట్టాలని పార్టీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు బుట్టా ప్రతూల్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. ఏడాది పాలన అయినా ప్రభుత్వం యువతకు, విద్యార్థులకు ఇచ్చిన హామీ అమలులో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని ధ్వజమెత్తారు. యువతకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టే వైఎస్సార్‌సీపీ యువత పోరుకు యువత, విద్యార్థులు మద్దతు ఇవ్వాలని కోరారు.



బుట్టా ప్రతూల్

గ్రామ కమిటీలు బాధ్యతాయుతంగా పనిచేయాలి

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీలు బాధ్యతాయుతంగా పనిచేసి పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బుట్టా శివనీలకంఠ అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయ ఆవరణలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక సారథ్యంలో నందవరం మండలంలోని పలు గ్రామాల కమిటీల నియామకం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దృష్టికి తీసుకొస్తే అధికారులతో చర్చించి ఆయా సమస్యల పరిష్కారానికై కృషి చేస్తారన్నారు. అనంతరం పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, గంగవరం, మిట్టసోమాపురం, రాయచోటి, గురుజాల, కనకవీడు పేట, టి.సోమల గూడూరు, పొనకలదిన్నె, ఇబ్రహీంపురం కొట్టాల గ్రామాలకు వైఎస్సార్‌సీపీ కమిటీలను ప్రకటించారు. సమావేశంలో పార్టీ నందవరం మండల అధ్యక్షుడు శివారెడ్డి గౌడ్, రాష్ట్ర మేధావుల ఫోరం సంయుక్త కార్యదర్శి కేఆర్ లక్ష్మీకాంతరెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరూపాక్షిరెడ్డి, సీనియర్ నాయకులు రామకోటేశ్వర్‌రెడ్డి, రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పేట శ్రీనివాసరెడ్డి, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బుట్టా శివనీలకంఠ

వర్షాలు కురవాలని..

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలో వర్షం కోసం గంగమ్మ పూజలు చేసేందుకు గాను మహిళలు గంపలో గంగమ్మ తల్లి విగ్రహానికి పూలు, వేపమట్టలు పెట్టి ప్రత్యేక పూజలు చేసి ఇళ్లళ్లు తిరుగుతూ భిక్షాటన చేస్తున్నారు. వర్షాలు కురవాలి వాన దేవుడా పంటలు బాగా పండాలి అంటూ పాటలు పాడుతూ ఇంటింటి వద్ద భిక్షను స్వీకరించి గ్రామంలోని దేవాలయాల దగ్గరకు వెళ్లి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. అనంతరం అన్నదానం చేస్తున్నారు. అలాగే గ్రామాల్లో వర్షం కోసం రోకలికి కప్పను, వేపాఆకులను కట్టి కప్పపై నీళ్లు పోస్తు వర్షం కురియాలని పాటలు పాడుతూ వీధుల్లో తిరగడం పరిపాటి. ఇలా పూజలు చేయడం వలన వర్షాలు కురుస్తాయని ప్రజల నమ్మకం.



వర్షం కోసం గంగమ్మ పూజకు భిక్షం ఎత్తుతున్న మహిళలు

పాఠశాలలో తాగునీటి బోరు

మంత్రాలయం రూరల్: విద్యార్థుల కోసం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఆదివారం బోరు వేయించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరమణ మాట్లాడుతూ.. ఎంపీ నిధులతో మండలంలో 3 బోర్లు మంజూరయ్యాయని తెలిపారు. మొదటి బోరు విద్యార్థుల కోసం పాఠశాల ఆవరణలో వేశామని, రెండున్నర ఇంచుల వరకు నీరు పడిందని వివరించారు. ఈ బోరు ద్వారా పైపులైన్ నిర్మాణం చేపట్టి పాఠశాలకు తాగునీరు సరఫరా అందిస్తామని చెప్పారు. త్వరలో పైపులైన్ పనులు చేపడతామన్నారు. ఒక్కో బోరుకు రూ.2 లక్షలు నిధులు చొప్పున మూడు బోర్లకు రూ.6లక్షలు కేటాయించినట్లు వెల్లడించారు.



మంత్రాలయంలో స్కూల్ ఆవరణలో వేసిన బోరు

గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలి

నందవరం : గ్రామాల్లో ప్రభుత్వం సీసీరోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు వంటి అభివృద్ధి పనులు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్నగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం గురజాల గ్రామంలో సీపీఐ మండల కార్యదర్శి గిడ్డయ్య ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సీపీఐ పార్టీ నిరంతరం ప్రజల కోసం పోరాటాలు చేస్తుందని వివరించారు. గ్రామంలో గతంలో పెత్తందారుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటాలు చేసిందన్నారు. అనంతరం సీపీఐ నూతన గ్రామ శాఖ కార్యదర్శిగా సయ్యద్ బాషాను, 10 మంది సభ్యులతో గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విజయేంద్రతీర్థులకు ఏకాదశి పూజలు



శ్రీరాఘవేంద్ర, విజయేంద్రతీర్థుల మూల విరాట్‌లకు పూజలు చేసిన దృశ్యం

హొళగుంద: స్థానిక కోట ఆంజనేయస్వామి ఆలయంలో వెలసిన విజయేంద్రతీర్థుల 411 ఆరాధనోత్సవాల్లో భాగంగా ఆదివారం అర్చకులు ఏకాదశి ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామి వారికి నిర్మల్య విసర్జన, మంగళ హారతి, సాయంత్రం పండితుల ప్రవచనాలు, భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు చేపట్టారు. అలాగే రాఘవేంద్ర, విజయేంద్రతీర్థుల మూల విరాట్‌లకు రోజువారి పూజలు జరిపించారు. సోమవారం మధ్యారాధన, మంగళవారం ఉత్తరాధన కార్యక్రమాలు జరగనున్నాయి. ఉత్తరాధన రోజు రథోత్సవం, ఇతర ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ఆరాధనోత్సవాలు ముగుస్తాయని అర్చకులు, ఆలయ ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

గోనెగండ్ల : పత్తి పంటను సాగుచేసిన రైతులు సస్య రక్షణ చేపట్టాలని ఎమ్మిగనూరు సహాయ వ్యవసాయ సంచాలకులు మహమ్మద్ ఖాద్రీ సూచించారు. ఆదివారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో పత్తి పంటను పరిశీలించారు. ఈ ఆయన మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో ఎమ్మిగనూరు డివిజన్‌లో పత్తి పంటను దాదాపు లక్ష ఎకరాలలో సాగు చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుత పంట విత్తి 20 రోజుల నుంచి 30 రోజులయ్యింది. ఇప్పుడున్న పొడి వాతావరణంలో పత్తి పంటలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం పత్తి పంటలో పేను బంక ఆశించినట్లు గుర్తించామని చెప్పారు. ఇది ఆకుల నుంచి రసం పీల్చి ఆకులను గిడసబారేటట్టు చేస్తుందన్నారు. దీని వల్ల మొక్కల పెరుగుదల తగ్గిపోతుందన్నారు. దీని నివారణకు అసిఫేట్ 1.5 గ్రాములు లేదా అపిడోఫైరోఫెన్ 1.5 మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటికి కలుపుకొని సాయంత్రం వేళల్లో ఆకులు బాగా తడిచేటట్టు పిచికారీ చేసుకోవాలన్నారు. ప్రస్తుతం ఉన్న పొడి వాతావరణం వలన ఆకులు వడలిపోయినట్టు గమనించడం జరిగిందన్నారు. దీనికోసం పత్తి పంట 20 రోజులలోపు అయితే 19:19:19 అనే స్పెషల్ ఫర్టిలైజర్ 2.5 గ్రాములు లేదా పత్తి పంట 30 రోజులు దాటితే 5 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలుపుకొని మొక్కలను బెట్ట పరిస్థితి నుంచి కాపాడుకోవచ్చని తెలియజేశారు.



రసం పీల్చే పురుగు ఆశించిన పత్తి మొక్క

చిలకలడోణలో దాహం దాహం

మంత్రాలయం రూరల్ : దాహం తీర్చుకోవడానికి పల్లె వాసులు పడుతున్న కష్టాలు అంతా..ఇంత కాదు. మండలంలోని చిలకలడోణ గ్రామంలో వారానికి రెండు సార్లు నీళ్లు వస్తుండటంతో, గ్రామానికి ఒక్క బోరే ఉండటం అంది కూడా ఊరు శివారులో ఉండటంతో గ్రామస్తుల తాగునీటి అవసరాలకు సరిపోవడంలేదు. దీంతో బైక్‌లపైన, సైకిళ్లపైన, ఆటోలపైన ఎద్దుల బండ్లపైన సూదూర ప్రాంతాలకు వెళ్లి తాగునీరు తెచ్చుకుని గొంతులు తడుపుకుంటున్నారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి తీర్చడానికి ఏ అధికారి కూడా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నాతాధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



బండిపై తాగనీరు తీసుకువస్తున్న రైతు హనుమంతు

అన్నదమ్ముల ఘర్షణ.. ట్రాక్టర్‌కు నిప్పు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎస్.నాగలాపురం గ్రామంలో ఆదివారం సాయంత్రం ఇద్దరు అన్నదమ్ముల మధ్య జరిగిన ఘర్షణలో ట్రాక్టర్‌కు నిప్పంటించిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన మేరకు వివరాలు... గ్రామానికి చెందిన నాగేశ్వరరావు, రాందాసు అన్నదమ్ములు. కొంత కాలంగా ఆస్తి విషయంలో మనస్పర్థలు ఉన్నాయి. ఆదివారం నాగేశ్వరరావుకు చెందిన ట్రాక్టర్ రాందాసు స్థలంలో ఉంచడంతో.. తన స్థలంలో ఎలా పెడతావంటూ రాందాసు గొడవపడ్డాడు. బాటిల్లో ఉన్న పెట్రోల్ ట్రాక్టర్ ఇంజిన్‌పై వేసి నిప్పంటించటంతో మంటలు చెలరేగాయి. వెంటనే అక్కడ ఉన్నవారు మంటలను ఆర్పివేశారు. మంటలు ఆర్పకపోయింటే ట్రాక్టర్ కాలిపోయేదని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై రూరల్ ఎస్ఐ శ్రీనివాసులను అడుగగా అన్నదమ్ములు గొడవపడినట్లు మా దృష్టికి వచ్చిందని. కేసు నమోదు చేయలేదని, బాధితులు వచ్చి ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని చెప్పారు.



ట్రాక్టర్‌కు నిప్పంటించిన దృశ్యం

రోడ్లు ఛిద్రం.. ప్రయాణం నరకప్రాయం



కంకరతేలి గుంతలు పడిన రోడ్డు

- అధ్వానంగా మారిన పల్లె రహదారులు
- కంకరతేలి గుంతలు పడిన వైనం
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు



కే.పేట రహదారి దుస్థితి

నందవరం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పల్లె ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలు చేపడతామని ఎన్నికల్లో ఊదరగొట్టారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా పల్లెల్లో అభివృద్ధి పనులు చేపట్టలేదు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. ప్రధాన దారులు కంకరతేలి గుంతలు ఏర్పడి ప్రయాణం నరకంగా మారింది. వాహనదారులు ఈ దారుల్లో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

5 కిలో మీటర్ల ప్రయాణానికి గంట సమయం

మండల పరిధిలోని కే.పేట గ్రామానికి చెందిన ప్రధాన రహదారి కంకర తేలి గుంతల మాయంగా మారింది. ఈ రోడ్డుపై నాగలదిన్నె నుంచి కే.పేట, కనకవీడు మీదుగా ఎమ్మిగనూరుకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే కే.పేట గ్రామం నుంచి నాగలదిన్నెకు వెళ్లె రహదారి 5 కిలోమీటర్లు ప్రయాణం సాగించడానికి గంట సమయం పడుతుంది. 5 కి.మీటర్లు 500 గుంతలు ఏర్పడాయి. ఈ దారిలో వెళ్లాడానికి వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్డు బాగుచేయండి



కూటమి ప్రభుత్వం వచ్చాక ఆర కిలో మీటర్ ప్యాచులు వేసి వదిలేశారు. దారంతా గుంతలమయంగా మారింది. దాదాపు ఏడాది గడిచినా రోడ్డు గురించి పట్టించుకోలేదు. మా గ్రామ నుంచి నాగలదిన్నెకు వెళ్లాడానికి ప్రయాణం నరకంగా మారింది. గుంతలు ఏర్పడి ద్విచక్ర వాహనదారులు కింద పడిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులు చేపట్టాలి.

– రామిరెడ్డి, కే.పేట, నందవరం మండలం